www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:57 WEDNESDAY ,JULY 08,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 57 బుధవారం 08 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-

## హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం



**సోమాజిగూడలో 17 అంతస్తుల భవన నిర్మాణ అనుమతుల రద్దుకు ప్రతిపాదన**

**ప్రాజెక్టు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను నిలిపివేసిన జీహెచ్ఎంసీ ఉల్లంఘనలు**

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు జీహెచ్ఎంసీ (జీహెచ్ఎంసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 2

# డిజిటల్ గవర్నెన్స్‌తో

## పారదర్శక పరిపాలన అందిస్తాం



హంసకలం వార్త

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా అధికారులకు పలు కీలక అంశాలపై దిశా నిర్దేశం చేశారు. డిజిటల్ గవర్నెన్స్ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి, అవసంమైన చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పరిపాలన వ్యవస్థను పూర్తిస్థాయిలో మిగతా2లో



## ఉగ్రవాదం పై సమిష్టి పోరాటం

హంసకలం వార్త

భారతదేశం ఎల్లప్పుడూ శాంతియుత అభివృద్ధి మార్గాన్నే అనుసరిస్తుందని, ఏనాడూ విస్తరణ వాదానికి తావివ్వబోదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇండోనేషియా పర్యటనలో భాగంగా అక్కడి పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య శతాబ్దాలుగా ఉన్న చారిత్రక, సాంస్కృతిక మరియు బలమైన ప్రజాస్వామ్య సంబంధాలే భారత్-ఇండోనేషియాల ఉమ్మడి బలమని ఆయన ఈ సందర్భంగా అభివర్ణించారు. మిగతా2లో

## ఈసీపై ముస్లిం ఎమ్మెల్యేల ఒత్తిడి


**ఈసీపై ముస్లిం ఎమ్మెల్యేలు ఒత్తిడి తెస్తున్నారని బీజేపీ ఆరోపణ**

**ఒవైసీ పీఆర్సీ డిమాండ్ అక్రమ వలసదారుల కోసమేనన్న ప్రకాశ్ రెడ్డి**

**తమ సామాజికవర్గం వారినే బీఎల్‌ఓలుగా నియమిస్తున్నారని విమర్శ**

**పీఆర్సీలు ఇవ్వాలంటూ రేవంత్ సర్కారుకు ఒవైసీ చేసిన విజ్ఞప్తి**

హంసకలం వార్త : తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ రాజకీయంగా తీవ్ర చర్చనీ యాంశమైంది. ముస్లిం ఎమ్మెల్యేలు ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకు వచ్చి, తమ సామాజిక వర్గానికి చెందిన వారినే బూత్ స్థాయి అధికారులుగా (బీఎల్‌ఓ) నియమిం



చుకుం టున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మిగతా2లో

## పార్టీ పేరు వివాదం..

### ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత

-తన కొత్త పార్టీ పేరు వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత
-'టీఆర్ఎస్' పేరుపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎన్నికల సంఘం
-ముందుగా ఈసీకి వివరణ ఇవ్వాలని కవితకు సూచించిన ఉన్నత న్యాయస్థానం





## తెలంగాణలో రైతుల భూములపై భారీ కుట్ర జరుగుతోంది

**రైతుల భూ హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందన్న ప్రవీణ్ కుమార్**

**కాళేశ్వరంలో నీళ్లు ఉన్నా పొలాలకు అందకుండా చేస్తున్నారని మండిపాటు**

**భూభారతి పోర్టల్ ద్వారా అక్రమ భూమి బదిలీలు జరుపుతున్నారని ఆరోపణ**

హంసకలం వార్త

తెలంగాణలో రైతులు, భూమి యజమానుల ఆస్తుల పై భారీ కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆర్థికంగా, భూమి హక్కుల పరంగా దెబ్బతీస్తోందని విమర్శించారు. 2లో



## సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన

**సింగరేణికి నైనీ కోల్ బ్లాక్**

**తాడిచెర్ల-2 బ్లాక్ కూడా కేటాయింపు**

**బొగ్గు ఉత్పత్తి పెంచాలని సూచన**

**నైనీలో 35 ఏళ్లకు సరిపడా నిల్వలు**

**రూ.75 వేల కోట్ల ఆదాయం అంచనా**

హంసకలం వార్త :సింగరేణికి మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు దక్కనున్నాయి. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం మాట్లాడిన కిషన్ రెడ్డి సింగరేణికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని మిగతా2లో

## 'సీఎం విజయ్ పర్యటనలను కూడా మేమే నియంత్రించాలా?'..

-సీఎం విజయ్ కరూర్ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ డీఎంకే పిటిషన్
-సీఎం పర్యటనలపై ఆంక్షలు విధించాలని విన్నపం
-సాక్షులపై సీఎం ప్రభావం చూపుతారని డీఎంకే వాదన
-రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఎలా ఆదేశాలిస్తామని కోర్టు ప్రశ్న
-కరూర్ తొక్కిసలాట కేసు నేపథ్యంలో పిటిషన్



హంసకలం వార్త

తమిళనాడు ప్రతిపక్ష పార్టీ డీఎంకేపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి విజయ్ పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. 2లో



## స్మగ్లర్లపై కఠిన చర్యలు

### డీజీపీ సీవీ ఆనంద్ వార్నింగ్

హంసకలం వార్త : పోలీస్ వ్యవస్థలో అవినీతిని నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ప్రలోభాలకు లొంగవద్దని సిబ్బందిని కోరుతున్నామని అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో డీజీపీ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కమిషనరేట్‌లో సిబ్బంది పనితీరుపై సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఖమ్మం కమిషనరేట్‌కి వచ్చానని తెలిపారు. ఖమ్మం తెలంగాణ రాష్ట్రానికి మిగతా2లో

## కొండా సురేఖ-కడియం శ్రీహరి మధ్య ముదురుతున్న వివాదం



హంసకలం వార్త

మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. జిల్లా వ్యవహారాల్లో కడియం శ్రీహరి జోక్యం చేసుకుంటున్నారంటూ మంత్రి సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. సోమవారం వరంగల్ నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్‌కు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను కోరినట్లు తెలిసింది. వరంగల్ జిల్లా వ్యవహారాల్లో కడియం శ్రీహరి జోక్యం చేసుకోవడంపై మంత్రి కొండా సురేఖ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై AICCతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు మిగతా2లో

# డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక పరిపాలన అందిస్తాం

ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. డిజిటల్ గవర్నెన్స్ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి, అవసరమైన చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పరిపాలన వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేస్తూ ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని సీఎం సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రా క్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలని నిర్దేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తిస్థాయి కసరత్తు చేసేందుకు ఒక కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. 100 రోజుల్లో ఆ కమిటీకి నివేదిక సమర్పించి ఒక కొలిక్కి తీసుకురాలని ఆదేశించారు. ప్రభుత్వం చెల్లింపులు చేసినా సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం..

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు జీహెచ్ఎంసీ (జీహెచ్‌ఎంసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులో సదరు సంస్థ నిర్మిస్తున్న 17 అంతస్తుల నివాస సముదాయానికి మంజూరు చేసిన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొంది. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ప్రదీప్ రెడ్డి బద్వేలు ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. రెండు సెల్లార్లు, స్టిల్ట్ పార్కింగ్‌తో పాటు 17 అంతస్తులతో కూడిన రెండు టవర్లను ఇక్కడ నిర్మిస్తున్నారు. అయితే, ఈ నిర్మాణంలో కొంత భాగం హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తోం దని అధికారులు గుర్తించారు. ఈ నిర్మాణానికి సంబంధించి సాగునీటి పారుదల (ఇరిగేషన్) శాఖ నుంచి ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకో లేదని వెల్లడైంది. ఇరిగేషన్ శాఖ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం 'హైడ్రా' కమిషనర్ ఏ.వి. రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల సంయుక్తంగా ఈ ప్రాజెక్టును తనిఖీ చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణానికి తాము ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 450 ప్రకారం నిర్మాణ అనుమతులను రద్దు చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తును సైతం జీహెచ్‌ఎంసీ తాత్కాలికంగా నిలిపివేసింది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని పక్షంలో భవనాన్ని వినియోగించడం చట్టవిరుద్ధం కావడమే కాకుండా, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి కనీస వసతులు లభించవు. తాజా పరిణామాలతో సదరు ప్రాజెక్టులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జీహెచ్‌ఎంసీ నోటీసుపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ ఇచ్చే వివరణ ఆధారంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

# స్మగ్లర్లపై కఠిన చర్యలు..

పోలీస్ వ్యవస్థలో అవినీతిని నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ప్రలోభాలకు లొంగవద్దని సిబ్బందిని కోరుతున్నామని అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో డీజీపీ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కమిషనరేట్‌లో సిబ్బంది పనితీరుపై సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఖమ్మం కమిషనరేట్‌కి వచ్చానని తెలిపారు. ఖమ్మం తెలంగాణ రాష్ట్రానికి ముఖద్వారంగా ఉందని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై సమీక్షించానని పేర్కొన్నారు. ఏఐపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం..ఒగత మూడేళ్లుగా జరుగుతున్న నేరాలపై సమీక్షించామని డీజీపీ తెలిపారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. 6500 మంది అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించామని అన్నారు. ప్రతి రోజూ 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సిబ్బంది పనిభారంపై చర్చించామని చెప్పుకొచ్చారు. ఏఐపై సిబ్బందికి ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను తీసుకువస్తున్నాం.. స్మగ్లర్లపై చాలా కఠినంగా చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. ఛత్తీస్‌ఘడ్, ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి ఫెడ్లర్లు వస్తున్నారని అన్నారు. సరిహద్దుల్లో గట్టి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సైబర్ క్రైంపై గట్టి నిఘా ఉంచామని వెల్లడించారు. సోషల్ మీడియాలో అసాంఘిక కార్యకలాపాలను ప్రచారం చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. ట్రాఫిక్ సిస్టమ్‌ను మెరుగుపరిచేందుకు ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను తీసుకువస్తున్నామని వెల్లడించారు. హైవేలపై అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని.. దీనివల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## ఈసీపై ముస్లిం ఎమ్మెల్యేల ఒత్తిడి

తమ సామాజిక వర్గానికి చెందిన వారినే బూత్ స్థాయి అధికారులుగా (బీఎల్‌ఓ) నియమించుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఈ చర్య ద్వారా అనర్హులను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు కుట్ర జరుగుతోందని ఆయన మండిపడ్డారు. అదేవిధంగా, రాష్ట్రంలో శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలను (పీఆర్సీ) జారీ చేయాలంటూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన డిమాండ్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రంలో జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన వారిని కొత్త ఓటర్లగా నమోదు చేయడం, మరణించిన వారు లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ప్రకాశ్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో ఉన్న బంగ్లాదేశీయులు, రోహింగ్యా అక్రమ వలసదారులను ఓటర్ల జాబితాలో చేర్పించడమే లక్ష్యంగా ముస్లిం ఎమ్మెల్యేలు ఎన్నికల సంఘంపై ఒత్తిడి తెస్తున్నారని ప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. "దేశంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులకు పౌరసత్వం కల్పించడానికే అసదుద్దీన్ ఒవైసీ పీఆర్సీ కార్డుల డిమాండును తెరపైకి తెచ్చారు. ఇది రాజ్యాంగ విరుద్ధం మరియు దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్య" అని ఆయన పేర్కొన్నారు. నివాస ధ్రువీకరణ పత్రాల కోసం పేద ప్రజలు ఇబ్బంది పడకుండా, భవిష్యత్తులో పౌరసత్వానికి సంబంధించిన ఎటువంటి చిక్కులు తలెత్తకుండా కర్ణాటక నమూనాలో పీఆర్సీలు జారీ చేయాలని సోమవారం అసదుద్దీన్ ఒవైసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కాగా, బీఎల్‌ఓల నియామకం ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి రాదని, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఇది పూర్తిగా ఎన్నికల సంఘం పర్యవేక్షణలోనే సాగుతుందని ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నుంచి అనర్హులు, డూప్లికేట్ ఓటర్లను తొలగించే విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 'సీఎం విజయ్ పర్యటనలను కూడా మేమే నియంత్రించాలా?'

తమిళనాడు ప్రతిపక్ష పార్టీ డీఎంకేపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి విజయ్ పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో డీఎంకే వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి విజయ్ జులై 10న అక్కడ పర్యటించనున్నారని డీఎంకే కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టీవీకే నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది. అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా? రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలా ఆదేశాలు ఇస్తుంది?" అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో డీఎంకే తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది. (గతేడాది సెప్టెంబరులో కరూర్‌లో విజయ్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. తొక్కిసలాటకు టీవీకే కార్యకర్తల నిర్లక్ష్యమే కారణమని డీఎంకే ఆరోపిస్తుండగా, ఇదంతా డీఎంకే రాజకీయ కుట్రేనని విజయ్, టీవీకే నేతలు ఆరోపిస్తున్నారు.

## ఉగ్రవాదం పై సమిష్టి పోరాటం

ఇటీవల కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడుల సమయాల్లో భారతదేశానికి వెన్నంటి ఉండి, అండగా నిలిచినందుకు ఇండోనేషియా ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధాని మోదీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించేది లేదని ఆయన తేల్చిచెప్పారు. మానవాళికి శత్రువుగా మారిన ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ఇరు దేశాలు భవిష్యత్తులోనూ సమష్టిగా పోరాడుతాయని ప్రధాని పిలుపునిచ్చారు.

**ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**

అభివృద్ధి శకం: భారతదేశ ప్రాధాన్యత ఎప్పుడూ పొరుగు దేశాల వృద్ధి, పరస్పర సహకారమే తప్ప.. భూభాగాలను ఆక్రమించే విస్తరణ వాదం కాదని వెల్లడి. బలమైన బంధం: ఇండోనేషియా, భారత్‌ల మధ్య ఉన్న సాంస్కృతిక సారూప్యతలు ఇరు దేశాల ఆర్థిక, వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని వ్యాఖ్య. భద్రతకు ప్రాధాన్యత: హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు, సముద్ర తీర భద్రతకు ఇరు దేశాల భాగస్వామ్యం ఎంతో కీలకమని స్పష్టీకరణ. ప్రధాని మోదీ ప్రసంగానికి ఇండోనేషియా పార్లమెంట్ సభ్యుల నుంచి విశేష స్పందన లభించింది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలలో ఈ పర్యటన ఒక కొత్త మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పార్టీ పేరు వివాదం..

కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ పేరు నమోదుకు సంబంధించి నెలకొన్న వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పేరుకు అనుమతినిచ్చేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించాలని కోరుతూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇవ్వాలని కవితకు సూచించింది. ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోవడం ఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుందని కోర్టు స్పష్టం చేసింది. బీఆర్ఎస్ పార్టీ పాత పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి'ని పోలి 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామం వస్తుండటంతో, దీనిపై జూన్ 23న కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పేరు ప్రజల్లో గందరగోళానికి దారితీస్తుందని పేర్కొన్న ఈసీ, 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కవితను ఆదేశించింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ ఆదేశాలనే కవిత కోర్టులో సవాలు చేశారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత, ఈ ఏడాది ఆరంభంలో సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఏప్రిల్‌లో ఈసీ ప్రాథమిక ఆమోదం తెలిపింది. అయితే, ఈ పేరులోని 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త రూపం పాత పార్టీని గుర్తుచేస్తోందంటూ 1,100కు పైగా అభ్యంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం కవితకు నోటీసులు జారీ చేసింది.

## తెలంగాణలో రైతుల భూములపై భారీ కుట్ర జరుగుతోంది

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆర్థికంగా, భూమి హక్కుల పరంగా దెబ్బతీస్తోందని విమర్శించారు. ఒకవైపు, కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లున్నా కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేయకుండా రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్నారని... మరోవైపు, భూభారతి పోర్టల్ ద్వారా అక్రమ భూమి బదిలీలు జరుపుతున్నారని ఆరోపించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పోర్టల్‌లో దాదాపు 22 వేల భూ బదిలీలు అక్రమంగా జరిగాయని, రైతులకు తెలియకుండానే వారి భూములు ఇతరులకు మార్చేశారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. నిషేధిత జాబితా భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను కూడా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి తమ ఇష్టానికి బదలాయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్ బాగా పని చేస్తుండగా, కాంగ్రెస్ వచ్చాక భూమాఫియా రాజ్యం మొదలైందని విమర్శించారు. హైదరాబాద్ చుట్టుపక్కల భూకబ్జాలు పెరిగాయని, రైతుల ఆస్తులను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం మాట్లాడిన కిషన్ రెడ్డి సింగరేణికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కేలా కేంద్రం చొరవ తీసుకుందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాక్‌ల వేలంలోనూ సింగరేణి పాల్గొనేలా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో మరో 35 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. దీని వల్ల సింగరేణికి సుమారు రూ. 75 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. తెలంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారం సింగరేణి అని పేర్కొన్నారు. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ బ్లాక్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి పెరగడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

## కొండా సురేఖ-కడియం శ్రీహరి మధ్య ముదురుతున్న వివాదం

వరంగల్ జిల్లా వ్యవహారాల్లో కడియం శ్రీహరి జోక్యం చేసుకోవడంపై మంత్రి కొండా సురేఖ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై AICCతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ లేఖ రాయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఈ పరిణామంతో కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య కొనసాగుతున్న రాజకీయ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పందన ఏంటనేది ఆసక్తికరంగా మారింది.

## కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలో భారీ ప్రక్షాళన..


ముగ్గురు ఉన్నతాధికారులను వారి పదవుల నుంచి తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేట్ నికోబార్ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన రహస్య ఫైళ్లు లీక్ కావడంపై పీఎంఓ సీరియస్ అయింది. మంత్రి వ్యక్తిగత సిబ్బంది నుంచే పర్యావరణ నివేదికలు లీక్ అయినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో గుర్తించింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ వ్యక్తిగత సిబ్బందిపై కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. పర్యావరణ శాఖామంత్రి భూపేంద్ర యాదవ్ సెక్రటరీ (PS) అమర్ సింగ్‌ను (IRS) పరిపాలనాపరమైన కారణాలతో తక్షణమే విధుల్లో నుంచి కేంద్రం తొలగించింది. 2010 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అమర్ సింగ్ సేవలను రద్దు చేసి.. తక్షణమే మాతృ సంస్థ అయిన రెవెన్యూ విభాగానికి కేంద్ర ప్రభుత్వం పంపించింది. పర్యావరణ మంత్రి అడిషనల్ ప్రైవేట్ సెక్రటరీలు ఆయుశ్ శరణ్, శైలేశ్ కుమార్ సింగ్‌ల నియామకాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేసింది. ఒకే రోజు, ఒకే మంత్రిత్వ శాఖకు చెందిన ముగ్గురు కీలక ఉన్నతాధికారులను తొలగించడం పై ఢిల్లీ బ్యూరోక్రసీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తొలగింపు ఉత్తర్వుల కాపీలను ప్రధానమంత్రి కార్యాలయం (PMO), కేబినెట్ సెక్రటేరియట్‌కు పంపడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది.


# సంపాదకీయం


## మణిగుహ్: గ్రంథాలయ గ్రామం

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుద్రప్రయాగ్ జిల్లాలో సముద్ర మట్టానికి సుమారు 1,664 మీటర్ల ఎత్తులో ఉన్న చిన్న కొండ గ్రామం మణిగుహ్. హిమాలయాల అద్భుత దృశ్యాల మధ్య ఉన్న ఈ గ్రామం ఇప్పుడొక ప్రత్యేక గుర్తింపును సాధించింది. 20,000కు పైగా పుస్తకాలు, ఎనిమిది పఠన కేంద్రాలు, చదవడాన్ని దైనందిన జీవితంలో భాగంగా మార్చుకున్న సముదాయం కారణంగా ఇది 'గ్రంథాలయ గ్రామం'గా ప్రసిద్ధి చెందింది. ప్రకృతి అందాల మధ్య జ్ఞానానికి నిలయంగా మారిన ఈ గ్రామం, ఆధునిక భారత గ్రామీణాభివృద్ధికి ఒక కొత్త నమూనాను చూపిస్తోంది. ఈ గ్రామం నుంచి చౌఖంబా, సతోపంథ్, తలయ్‌సాగర్ వంటి హిమాలయ శిఖరాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇక్కడి పిల్లలు కొండ మార్గాల్లో నడుస్తూనే పుస్తకాల్లో మునిగిపోవడం, సాంకేతిక స్క్రీన్లకు సమానంగా పుస్తకాలను తమ జీవితంలో భాగం చేసుకోవడం ఒక సాధారణ దృశ్యం. చదవడం ఇక్కడ రోజువారీ జీవనశైలిగా మారింది. మణిగుహ్-- 'గ్రంథాలయ గ్రామం'గా పరివర్తన చెందడం వెనుక 'హమారా గావ్ ఘర్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ దీర్ఘకాలిక కృషి ఉంది. గ్రామంలో చదవడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, ప్రజలను పుస్తకాలతో అనుసంధానించడం, విద్యను గ్రామ జీవనంలో భాగంగా మార్చడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. వారి ప్రయత్నాల ఫలితంగా గ్రామం.. ఒక సాధారణ నివాస ప్రాంతం నుంచి జ్ఞాన కేంద్రంగా మారింది. ఈ కార్యక్రమానికి కేంద్ర బిందువుగా ఉన్నది మణిగుహ్ సెంట్రల్ లైబ్రరీ, స్థానికంగా దీనిని 'పుస్తక తీర్థం'గా పిలుస్తారు. ఇక్కడ హిందీ, ఆంగ్లం, ఉర్దూ, సంస్కృతం, కశ్మీరీ, పంజాబీ వంటి అనేక భాషల్లో ఇరవై వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సైన్స్, చరిత్ర, సాహిత్యం, పోటీ పరీక్షల సన్నద్ధత, పిల్లల కథలు వంటి విభిన్న అంశాల పుస్తకాలు ఇందులో ఉన్నాయి. 19వ శతాబ్దానికి చెందిన అరుదైన ముద్రణలు కూడా ఇక్కడ భద్రపరచబడ్డాయి. ఈ గ్రంథాలయానికి ప్రవేశం పూర్తిగా ఉచితం. గ్రంథాలయ గ్రామ నమూనా మరో ముఖ్య లక్షణం... చదవడాన్ని ఒకే భవనానికి పరిమితం చేయకపోవడం. గ్రామం చుట్టుపక్కల ఉన్న ప్రతాప్‌నగర్, ఖమోలి, బందీ, ఖల్యూ వంటి ప్రాంతాల్లో ఎనిమిది చిన్న పఠన కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని 'పుస్తక మందిర్'లుగా పిలుస్తారు. ఇవి ప్రజలు సహజంగా కూడే ప్రదేశాల్లో-- దారులు, దేవాలయాలు, గ్రామ చౌరస్తాలు-- నిర్మించారు. మణిగుహ్ అభివృద్ధి నమూనా కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాదు. ఇది జీవనోపాధి, పర్యావరణం, సామాజిక అభివృద్ధిని కూడా కలిపిన సమగ్ర విధానాన్ని అనుసరిస్తోంది. గ్రామ మహిళలు పైన్ సూదులతో (పైరుల్) చేతిపని ఉత్పత్తులు తయారు చేస్తారు. సాధారణంగా అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే పైన్ సూదులను ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చడం ద్వారా, పర్యావరణ సమస్యను ఆర్థిక అవకాశంగా మార్చారు. ఈ ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఈ కార్యక్రమంలో మహిళల భాగస్వామ్యం గ్రామ ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తోంది. అదేవిధంగా తేనెటీగల పెంపకం (అపి కల్చర్) శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఇవి గ్రామస్థులకు స్థిరమైన ఆదాయ వనరులను అందించడమే కాకుండా, ప్రకృతితో సమన్వయంగా జీవించాలనే భావనను పెంపొందిస్తున్నాయి. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిని కలిపి ముందుకు తీసుకెళ్లడం ద్వారా గ్రామీణ అభివృద్ధికి ఒక కొత్త మార్గం రూపొందించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే 'గావ్--ఘర్ మహోత్సవ్' ఈ గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సాంస్కృతిక ఉత్సవంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రొఫెసర్లు, రచయితలు, కళాకారులు, కవులు పాల్గొంటారు. గ్రామ ప్రజలతో కలిసి వారు జ్ఞాన, సాంస్కృతిక చర్చల్లో భాగస్వామ్యం అవుతారు. 'బుక్ మారథాన్' అనే కార్యక్రమం ద్వారా చదవడాన్ని సామూహిక ఉద్యమంగా మార్చారు. అన్ని వయసుల ప్రజలు ఇందులో పాల్గొని పుస్తకాలను చదవడం, చర్చించడం ద్వారా అక్షరాస్యతను సామాజిక అనుభవంగా మారుస్తున్నారు. ఈ ప్రయత్నాలు గ్రామాన్ని కేవలం నివాస ప్రాంతంగా కాకుండా, ఒక ఆలోచనా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాయి. ఉద్యోగ అవకాశాల కోసం యువత నగరాలకు వలస వెడుతున్న పరిస్థితిని తగ్గించడానికి మణిగుహ్ గ్రామంలో విద్య, జీవనోపాధి, సాంస్కృతిక అభివృద్ధి వంటివాటిని ఒకే వేదికపై తీసుకువచ్చారు. ఉత్తరాఖండ్ ఓపెన్ యూనివర్సిటీ వంటి సంస్థలు కూడా ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. చదువు మధ్యలో ఆగిపోయిన మహిళలను తిరిగి విద్యా వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా గ్రామాభివృద్ధికి మరింత బలం చేకూరుస్తున్నారు. మొత్తానికి, మణిగుహ్ గ్రామం చూపిస్తున్నది ఒక స్పష్టమైన సందేశం-- 'పుస్తకాలు కేవలం చదవడానికి మాత్రమే కాదు, జీవితాన్ని మార్చడానికి కూడా ఉపయోగపడతాయి. ఒక్కో పేజీని తిరగేయడం ద్వారా ఒక సమాజం తన భవిష్యత్తును తిరిగి రాసుకోవచ్చు'.

# ఐశ్వర్యం నీడలో అప్పుల బతుకులు!




సంపద పోగుపడుతోంది, సామాన్యుల సంక్షేమం సన్నగిల్లుతోంది! వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం శాతాలు మొదలైన స్థూల ఆర్థిక సూచికలు భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యదాయకంగా, పురోగమన పథంలో ఉన్నదని మనకు విదితం చేస్తాయి. సగటు కుటుంబ బడ్జెట్‌ను పరిశీలించండి. స్థూల ఆర్థిక సూచికలు ఆవిష్కరిస్తున్న దృశ్యానికి భిన్నమైన వాస్తవ చిత్రం మనకు కనపడుతుంది. స్పష్టంగా చెప్పాలంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఏమంత శ్రేయోదాయకంగా లేదు. సంపద సృష్టికర్తలైన అత్యధిక ప్రజలకు నిజమైన సంక్షేమం లభించడం లేదు. గత పన్నెండు సంవత్సరాలుగా ఆర్థిక వ్యవస్థ సృష్టిస్తున్న సంపద, వ్యక్తిగత కొనుగోలు శక్తి-- ఒక వ్యక్తి తన ఆదాయంతో సమకూర్చుకోగల సరుకులు, సేవలు-- మధ్య అతి ముఖ్యమైన లంకె తెగిపోయింది. అనేక వృత్తులు, ఉద్యోగాలలో వాస్తవ వేతనాలు (ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేసినవి) పెరగలేదు. అసంఖ్యాక శ్రామిక కుటుంబాలు తమ జీవన వ్యయాలకు రుణాలు తీసుకోవల్సిన అగత్యంలో ఉన్నాయి. ఇదొక నిష్ఠుర నిజం. క్రెడిట్ కార్డు రుణాలపై ఆధారపడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అంతకంటే ముఖ్యంగా పదే పదే ఆ రుణాలు తీసుకోవడమూ పెరుగుతోంది. బంగారు ఆభరణాలు మొదలైన స్త్రీ ధనాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడమూ విరివిగా జరుగుతోంది. స్తంభించిన వేతనాలు, పెరుగుతున్న వినియోగ వ్యయాలకు మధ్య అంతరాన్ని పూడ్చుకునేందుకు రుణాలు చేయడం తప్పనిసరి అయిపోయింది. వర్తమాన జీవన వాస్తవమిది. మన సమాజంలో ఇప్పుడు వేతన--రుణ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉన్నది ఆ కఠోర వాస్తవం స్పష్టం చేస్తోంది. వేతనాలు వస్తున్నాయి. అవి సరిపోవడం లేదు. అప్పులు చేయడం అనివార్యమవుతోంది. విశేషమేమిటంటే అవి సులభంగా లభిస్తున్నాయి. వాటిని తీర్చడమే సమస్యవుతోంది. వేతన ఆదాయం జీవన వ్యయాలకు సరిపోకపోవడమే అందుకు కారణం. తత్ఫలితంగా శ్రామిక శ్రేణులు అపాయకరమైన ఆర్థిక దుస్థితిలోకి జారిపోతున్నాయి. భారతీయ కార్మికుల ఆర్థిక ఇక్కట్లకు ధరల పెరుగుదలను కారణంగా చూపడం సమంజసం కాదు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా చమురు సరఫరాలకు అంతరాయం కలగడంతో ధరలు పెరిగిన మాట నిజమే. అయితే మనుగడకు రుణాలు తీసుకోవల్సిన అగత్య మేర్పడడానికి కారణం అది మాత్రమే కాదు. జాతి సంపద సృష్టి అవుతున్న, పంపిణీ జరుగుతున్న తీరు తెన్నులే ఆ అసంగత పరిస్థితికి కారణాలని చెప్పి తీరాలి. ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా పురోగమిస్తోంది. స్టాక్ మార్కెట్ సూచీలు సదా ఊర్ధ్వ దిశలో ఉంటున్నాయి. అయితే పెరుగుతున్న జాతి సంపద, దానిని సృష్టించడంలో కీలకపాత్ర వహిస్తున్న శ్రామిక శ్రేణులకు సక్రమంగా, న్యాయబద్ధంగా పంపిణీ అవుతుందా? లేదు అనేదే కచ్చితమైన సమాధానం. వేతన అంతరాలు సుదీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం స్థూల ఆర్థిక వ్యవస్థపై కూడా ఉంటుందనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. వేతనాలు బెత్తెడుగా ఉండిపోవడం, వ్యయాలు బారెడు కావడం వల్లే భారతీయ కుటుంబాల నికర పొదుపు మొత్తాలు రికార్డు స్థాయిలో తగ్గిపోతున్నాయి. స్థూల జాతీయ వినియోగ ఆదాయం (జీఎన్‌డీఐ)లో 7 నుంచి 8శాతంగా ఉండే ఈ పొదుపు మొత్తాలు 2022--23 ఆర్థిక సంవత్సరంలో 5.2శాతానికి తగ్గిపోయాయి. అయితే స్థిర, చరాస్తులు తాకట్టు పెట్టి తీసుకునే రుణాలు 2014లో 3శాతం నుంచి 2023లో 5.7శాతానికి పెరిగాయి. ఫలితంగా చెల్లించవలసిన అప్పుల మొత్తాలు కూడా గణనీయంగా పెరిగిపోయాయి. కోవిడ్ ఉపద్రవంలో కుదేలయిన దేశ ఆర్థిక వ్యవస్థ ఆ తరువాత బాగా కోలుకున్నదనడంలో సందేహం లేదు. అయితే ఈ ఆర్థిక పునరుద్ధరణ వేతనాల నైష్పత్తిక పెరుగుదల వల్ల కాకుండా కార్పొరేట్ లాభాల పెరుగుదల వల్లే అన్నది ఒక చేదు సత్యం. 2014--25 సంవత్సరాల మధ్య అనియత కార్మికుల వాస్తవ వేతనాల వార్షిక పెరుగుదల రేటు 1.5శాతం కంటే తక్కువగా ఉన్నది. ఈ వేతన అణచివేతకు తోడు పట్టణ ప్రాంతాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడడంతో శ్రామిక శ్రేణుల జీవన పరిస్థితులు మరింత అధ్వానమయ్యాయి. పైగా 2018--19 సంవత్సరం నుంచి తిరోగమన వలసలు (ఉద్యోగాలు హరించుకుపోవడం, ఉపాధి అవకాశాలు మృగ్యమవడంతో పట్టణాలు, నగరాలకు వలసలు వచ్చినవారు తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోవడం) పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే వ్యవసాయేతర రంగాల నుంచి వ్యవసాయరంగ ఉపాధులకు లక్షలాది శ్రామికులు తిరిగి వెళ్ళిపోతున్నారు. వేతనాల పెరుగుదలకు ప్రత్యామ్నాయంగా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికంగా పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి అదెంతవరకు ఉపకరిస్తుంది? సమాధానం స్పష్టమే. వేతనాలు పెరగకపోయినా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికమవడంతో వినియోగదారు రుణాల స్వభావం మౌలికంగా మారిపోయింది. కుటుంబ రుణాలు ఇతోధికంగా పెరిగిపోవడం కంటే శ్రామిక ప్రజలు తమ జీవన వ్యయాల కోసం గణనీయంగా ఆ రుణాలపై ఆధారపడుతున్న పరిస్థితే బాగా కలవరపరుస్తోంది. ఇది దేశానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ అత్యవసర రుణాలు దేశ ప్రగతికి ఆటంకమవుతాయని పలువురు హెచ్చరిస్తున్నారు. సంప్రదాయంగా భారతీయ కుటుంబాలు తమకు డబ్బు అవసరమయినప్పుడు గృహాలు, పొలాలు, బంగారం మొదలైన వాటిని తనఖా పెట్టడం పరిపాటి. దీనివల్ల వారి తక్షణావసరాలు తీరడంతో పాటు స్థిర, చరాస్తుల రూపంలో భద్ర భవిష్యత్తును సమకూర్చుకునేందుకు కూడా దోహదం జరిగేది. మనుగడ కోసమే రుణాలు తీసుకోవలసిరావడం పరిస్థితులను సంక్లిష్టం చేస్తోంది. సురక్షితం కాని వ్యక్తిగత రుణాలు, వినియోగదారు రుణాల వార్షిక పెరుగుదల రేట్లు ఇటీవలి సంవత్సరాలలో 22 నుంచి 25శాతానికి పెరిగాయని ఆర్థిక సుస్థిరతపై ఆర్బీఐ (భారతీయ రిజర్వ్ బ్యాంక్) నివేదికలు వెల్లడించాయి. క్రెడిట్ కార్డులపై రుణాలు తీసుకోవడం, ఆభరణాలు మొదలైనవి తాకట్టు పెట్టి అప్పులు చేయడమనేది బాగా పెరిగిపోయింది. అయితే ఈ రుణాలు తిరిగి చెల్లించడం అంత చురుగ్గా జరగడం లేదు. ఫలితంగా వెండి, బంగారు ఆభరణాలకు సంబంధించి, చెల్లించని రుణాల మొత్తం రూ. 3.38 లక్షల కోట్లకు పెరిగిందని ఆర్బీఐ నివేదికలు వెల్లడించాయి. ఏటా ఈ రుణ బాకీల మొత్తం భారీ స్థాయిలో పెరుగుతూనే ఉన్నది. శ్రామిక కుటుంబాలు అధిక వడ్డీలతో సమకూర్చుకుంటున్న స్వల్పకాలిక రుణాలను తమ తక్షణావసరాలకు వినియోగించుకుంటున్నాయి. ఈ రుణాలను అవి తమ భావి ఆర్థిక స్తోమత భరోసాతోనే తీసుకుంటున్నాయనేది గమనార్హం. రేపో, మాపో లేదా ఆ తరువాతో తప్పకుండా అప్పు తీర్చగలమనే విశ్వాసంతోనే శ్రామిక కుటుంబాలు ఇలా రుణగ్రస్తమవుతున్నాయి. ఇదొక అవివేక వ్యవహారం. ఎందుకని? ఈ తరహా రుణాలు దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను నిర్లక్ష్యం చేయడమే, సందేహం లేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే శ్రామిక కుటుంబాల శ్రేయస్సుకు ఈ రుణాలు తోడ్పడవు. అప్పు చేసి పప్పు కూడు లాంటి ఈ రుణాలు, ఆదాయం పెరుగుదలతో సమకూరే ఆర్థిక భద్రతను ఇవ్వలేవు. ఒక స్థిరమైన సామాజిక భద్రతా వలయాన్ని సమకూర్చవు. ఇటువంటి సులభ రుణాల వల్ల శ్రామిక కుటుంబాల ఆర్థిక నష్టాలు రెట్టింపు అవుతాయి. ఈ కఠోర సత్యంతో పాటు వాస్తవ వ్యవసాయ వేతనాల వార్షిక పెరుగుదల 1శాతం కంటే తక్కువగా ఉందనే యథార్థాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. ఈ వాస్తవాలు స్పష్టం చేస్తున్నదేమిటి? దేశ ఆర్థిక వ్యవస్థ ఒక తీవ్ర సంక్షోభం ముంగిట ఉందనే కాదూ? దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో ఉన్నదని స్థూల ఆర్థిక సూచికలు స్పష్టం చేస్తున్నాయి. నిజమే. అయితే ఆ వృద్ధి సమరీతిలో లేదు. ఈ అసమాన వృద్ధి నుంచి సమ్మిళిత, సుస్థిర అభివృద్ధికి మనం పురోగమించాలి. ఇది జరగాలంటే సరఫరా సంబంధిత ప్రోత్సాహకాల (కార్పొరేట్ పన్ను కోతలు, మూలధన రాయితీలు వగైరా)కు స్వస్తి చెప్పాలి. వాటికి బదులుగా శ్రామిక శ్రేణులకు శ్రేయస్సును సమకూర్చే విధానాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇది తప్పనిసరి. కార్పొరేట్ సంస్థలకు సమకూర్చిన లబ్ధి పారిశ్రామిక ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంపొందించిందే కానీ, శ్రామిక శ్రేణుల వేతనాలలో వాస్తవ పెరుగుదలకు దోహదం చేయలేదు. తప్పనిసరి వినియోగ వస్తువులు, నిత్యావసర సేవలపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను హేతుబద్ధీకరించాలి. ప్రాథమిక మానవ అవసరాలను తీర్చే ఆ సరుకులు, సేవలు శ్రామిక కుటుంబాలతో సహా సమస్త అల్పాదాయ వర్గాల వారికి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. శ్రామిక శ్రేణులపై పన్నుల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రగతిశీల ప్రత్యక్ష పన్నులపై మరింతగా ఆధారపడేందుకు ప్రభుత్వం సుముఖత, సంసిద్ధత చూపాలి. ఇందులో భాగంగా శ్రమ--సాంద్ర సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమలను పునశ్శక్తిమంతం చేయాలి. భారీ ఉపాధి అవకాశాలు కల్పించే ఈ ఎమ్ఎస్ఎమ్ఈ రంగాన్ని పూర్తిస్థాయిలో పునరుజ్జీవింప చేసినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ సకల జనులకు శ్రేయోదాయకంగా పురోగమిస్తుంది. విస్మరించకూడని, తక్షణమే చేపట్టవలసిన మరో చర్య జాతీయ కనీస వేతనం పెంపుదల. ఇది లక్షలాది కార్మికులకు ఆర్థిక భద్రతను సమకూర్చుతుంది. ఉత్పాదకత పెరిగి ఆర్థిక వ్యవస్థ పురోగతి వేగవంతమవుతుంది. ఆరోగ్య భద్రత, విద్యారంగాలకు బడ్జెట్ కేటాయింపులను విధిగా పెంచి తీరాలి. విద్యా వైద్యరంగాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక నష్టాలు చవిచూస్తున్నాయి. ఆ నష్టాలను భరించడం తమకు మోయలేని భారమని అనేక రాష్ట్రాల పాలకులు సణుగుతున్నారు. కనుక కేంద్ర ప్రభుత్వమే ఆ నష్టాలను భరించేందుకు ముందుకు రావాలి. ఇది జరిగితే ఆరోగ్య భద్రత, పిల్లల విద్యా సదుపాయాల విషయంలో కుటుంబాలకు ఆర్థికభారం తగ్గుతుంది. తమ ఆదాయాన్ని ఇష్టానుసారం వ్యయం చేయగల వెసులుబాటు వాటికి లభిస్తుంది. ఇటువంటి మార్పుతో మనుగడ కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నుంచి శ్రామిక కుటుంబాలు బయటపడతాయి.

# బాచారం వద్ద అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లోని గ్రామాల ప్రజలు

-స్వచ్ఛంద పునరావాస కాలనీని పరిశీలించిన కలెక్టర్

-లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలలు

-ఆదర్శవంతమైన పునరావాస కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

హంసకలం వార్త



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని అటవీ గ్రామాల ప్రజల స్వచ్ఛంద పునరావాసం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామం వద్ద నిర్మిస్తున్న పునరావాస (ఆర్ ఴ ఆర్) కాలనీ పనులను, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సార్లపల్లి, కుడిచింతల బైలు, తాటిగుండాల పెంట, కొల్లంపెంట గ్రామాలకు చెందిన ఫేజ్--II (ఆప్షన్--II) లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేస్తున్న కాలనీకి సంబంధించిన సమగ్ర లేఅవుట్ మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి లబ్ధిదారునికి గృహ స్థలాలు, విశాలమైన అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలను నాణ్యతతో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, కమ్యూనిటీ హాల్, గ్రామ పరిపాలనా కార్యాలయం, రేషన్ దుకాణం, పార్కు, ఆట స్థలం వంటి సామాజిక మౌలిక సదుపాయాలను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాలనీని అన్ని సౌకర్యాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని అటవీ గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పునరావాసాన్ని ఎంచుకున్న నేపథ్యంలో, వారికి కొత్త ప్రాంతంలో మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రవాణా, విద్యుత్, ఉపాధి అవకాశాలు వంటి అన్ని ప్రాథమిక సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా కాలనీని అభివృద్ధి చేయాలని సూచించారు. పునరావాస కాలనీ అభివృద్ధిలో అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు మరియు భవనాల శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు ప్రతిపాదిత లేఅవుట్, ప్లాట్ల విభజన, రహదారుల నిర్మాణం, తాగునీటి వనరులు, విద్యుత్ కనెక్షన్లు, ప్రజా వినియోగ స్థలాల కేటాయింపు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అవసరమైన చోట మార్పులు చేసి లబ్ధిదారులకు మరింత అనుకూలంగా కాలనీ రూపకల్పన చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతంలో నూతన పాఠశాల భవనం ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

హంసకలం వార్త



గిరిజన విద్యార్థులకు వారి ఆవాసాల్లోనే నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం భీంపూర్ మండలం టెక్డిగూడ గ్రామంలో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థుల పఠన సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించి, వారి నైపుణ్యాలకు సంతృప్తి చెంది అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో శిథిలావస్థకు చేరిన భవనం వల్ల హనుమాన్ ఆలయ మందిరంలో నడిచిన బెల్సాయి రాంపూర్,టేకడి రాంపూర్ గిరిజన ప్రాథమిక పాఠశాలను, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు త్వరితగతిన నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాథమిక దశలోనే పిల్లలు భాషా నైపుణ్యాలు,ప్రాథమిక గణితం నేర్చుకుంటే ఉన్నత చదువులకు సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలను రోజూ బడికి పంపాలని, ఉపాధ్యాయులు ఇచ్చే హోంవర్క్ చేసేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. పాఠశాలలో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇస్తూ,భవన నిర్మాణానికి సహకరించిన ఐటీడీఏ, ఇంజనీరింగ్ అధికారులు, గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటి, ఇంటింటికి ఐదు మొక్కల చొప్పున గ్రామస్థులకు అందజేశారు.అనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతినీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి,ప్రారంభం కాని ఇళ్లను పక్షం రోజుల్లోగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమాలలో ఏటిడిఓ నిహారిక, హౌసింగ్ పిడి శంకర్, తహసీల్దార్ రమేష్, ఎంఈఓ రాధాకృష్ణ, సర్పంచ్ కేశవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పటేల్,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి

-ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

హంసకలం వార్త

జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయి, తాళ్ల ధర్మారం, తుంగూరు గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల్లోని వంట గదులు, ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని, పాఠశాలల్లో నిర్మిస్తున్న వంట గదులు అన్ని సౌకర్యాలతో పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సారంగాపూర్ మండల ంలోని నాగపుగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరు నమోదు అయ్యేలా విస్తృత అవగాహన కల్పించాలని, దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఈఈ (పీఆర్) లక్ష్మణరావు, మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బి.ఎల్.వో లు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ బీఆర్ఎస్ ఒక్కటే

-బీజేపీ నేతలకు దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించాలి

హంసకలం వార్త

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పై తీర్మానం చేసి సిబిఐ విచారణకు పంపిన అంశంపై విచారణ జరిపించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. బంజారాల శీత్ల పండుగ సందర్భంగా మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లంబాడి తండాలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పై బిజెపి నాయకులు చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ కొరకు తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే ఇప్పటివరకు విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.కాళేశ్వరంపై సీబీఐ విచారణ కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తేనే బీజేపీ బీఆర్ఎస్ ఒకటి కాదని భావిస్తామని లేదంటే రెండు పార్టీలు ఒకటేనని ప్రజలకు వివరిస్తామని మంత్రి తెలిపారు.




# జాతీయ రహదారి భూసేకరణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత

-ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

-బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలన

-గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి



హంసకలం వార్త

మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే మరియు సర్ ప్రక్రియతో పాటు కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలోని జాతీయ రహదారి భూసేకరణ పనులను జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రా ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా మేడి పెల్లి మండలంలోని దమ్మన్న పేట గ్రామంలో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు ( గ్రామ సభ) నిర్వహించారు. భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిదిలో వున్నా సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి ఇట్టి గ్రామ సభలో గ్రామ రైతులకు మరియు గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు. అనంతరం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, అర్హులైన భూ యజమానులకు ఎలాంటి జాప్యం లేకుండా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, భూమి కొలతల ఏ. డి కిషన్ ప్రసాద్, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ దొంగల ముఠా అరెస్ట్



హంసకలం వార్త

పొద్దంతా పాత ఇనుప సమన్లు కొంటామని గ్రామాలలో రెక్కీ నిర్వహిస్తారు రాత్రి అయ్యింది అంటే చాలు అసలు పనికి దిగుతారు.ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేయడానికి కావలసిన పరికరాలను సామాగ్రిని తరలించేందుకు కావలసిన వాహనాన్ని తీసుకొని బయలు దేరుతారు.చివరికి వారి బండారం బయట పడింది.ఆరుగురు దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడించారు.ఆర్మూర్ ఎసిపి కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో సిపి సాయి చైతన్య మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ను ధ్వంసం చేసి అందులోని రాగి కాయిల్స్ ను దొంగతనం చేస్తున్న ఆరుగురు దొంగల ముఠా ను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు .దొంగతనాలకు ప్రోత్సహించి దొంగలించిన కాపర్ కాయిల్స్ ను కొనుగోలు చేసే వారిని అరెస్ట్ చేసినట్టు పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడించారు.ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పాలు ట్రాన్స్ఫార్మర్ల దొంగతనానికి పాల్పడే ఆరుగురు సభ్యులు కలిగిన దొంగల ముఠాను ఆర్మూర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ట్రాన్స్ఫార్మర్ దొంగతానికి ఉపయోగించే పని ముట్లతో పాటు,వాటిని తరలించేందుకు ఉపయోగించిన వాహనాలను,ఐదు ,సెల్ ఫోన్లతో పాటు 70 కేజీల కాపర్ ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడించారు.ఆర్మూర్ కేంద్రంగా ఏర్పడ్డ ఈ ముఠా ట్రాన్స్ఫార్మర్ లను ద్వంసం చేసి కాపర్ కాయిల్స్ దొంగతనం చేసి విక్రయించి డబ్బు పొందే వారని తెలిపారు.కర్రే వినోద్ కుమార్, అంద్రాసి నవీన్, గుంజోల్ల ఈశ్వర్, బాజ హరిప్రసాద్, కర్రే విజయ్ కుమార్, మూల దుర్గాప్రసాద్ రెడ్డి, అబ్దుల్ వసీం హైమద్ అలియాస్ తిల్లి బాబా అనే వ్యక్తులు ఆర్మూరు కు చెందిన వారు ముఠాగా ఏర్పడ్డారు. వీరిపై గతం లో పలు స్టేషన్లలో ఇది వరకే కేసులున్నాయని తెలిపారు. ఈ కేసు చేదించుటలో ముఖ్య పాత్ర పోషించిన సిబ్బందిని అభినందించారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందండి

-మాక్లూర్‌లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సులో కలెక్టర్
-జక్రాన్‌పల్లి బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
-విద్యాసంస్థల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం
-పరిశుభ్రత లోపాలపై అసంతృప్తి,కఠిన చర్యలు
-నిజామాబాద్ జిల్లా కలెక్టర్
-ఇలా త్రిపాఠి విస్తృత పర్యటన



హంసకలం వార్త

రైతులు సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా అధిక దిగుబడి, మెరుగైన ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు.అదే సమయంలో వసతి గృహాలు, పాఠశాలలు,రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం మాక్లూర్ మండలం చిన్నాపూర్ రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న అనంతరం,జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్/డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.మాక్లూర్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో అధికారులు ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.ఇప్పటికే ఆయిల్ పామ్ సాగు చేసి మంచి దిగుబడులు సాధించిన రైతులు జైడి మధుసూదన్,లక్ష్మణ్,గడ్డం గంగారెడ్డి,సుధాకర్ తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు.ప్రభుత్వ సబ్సిడీతో ఆయిల్ పామ్ సాగు చేపట్టి మంచి లాభాలు పొందుతున్నామని, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం కూడా వస్తోందని తెలిపారు.డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ,మొక్కలపై ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తోందని చెప్పారు. ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాల్లో సాగును పరిశీలించిన అనంతరం తాము ఈ పంటను ఎంచుకున్నామని వివరించారు.రైతులతో మాట్లాడిన కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, ఈ సీజన్‌లో 1,600 ఎకరాల లక్ష్యానికి బదులుగా కనీసం 2,000 ఎకరాల్లో సాగు విస్తరించాలని నిర్ణయించామని తెలిపారు. జిల్లాలోనే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని,ఇప్పటికే దిగుబడుల సేకరణ కోసం కలెక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.వరి సాగులో కూలీల కొరత,వాతావరణ మార్పులు,ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగును పరిశీలించాలని సూచించారు.వంట నూనెతో పాటు అనేక ఉత్పత్తులకు ఈ పంటకు మంచి మార్కెట్ డిమాండ్ ఉందన్నారు.ప్రభుత్వం ఎకరాకు సంవత్సరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్ల పాటు ఇన్‌పుట్ సబ్సిడీ,డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ,మొక్కలపై కూడా రాయితీలు అందిస్తోందని వివరించారు.ఆయిల్ పామ్ బోర్డు ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కంపెనీలే పంటను కొనుగోలు చేస్తాయని,రైతులు మార్కెటింగ్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎకరానికి సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని,ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులను బట్టి ఎకరానికి రూ. 1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు.ఒకసారి సాగు ప్రారంభిస్తే దాదాపు 30 సంవత్సరాల పాటు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు.సాగుకు ముందుకు వచ్చే రైతులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పలువురు రైతులు కలెక్టర్ సమక్షంలోనే డీడీలు చెల్లించి ఆయిల్ పామ్ సాగుకు ముందుకొచ్చారు.ఆదర్శ రైతులు బాశెట్టి గంగాధర్,రాహుల్ రాజ్, బాశెట్టి లక్ష్మణ్‌లను సన్మానించారు. అనంతరం వ్యవసాయ పరికరాలు, ఆయిల్ పామ్ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించారు.అనంతరం జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్/డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, స్టోర్‌రూమ్,వంటగది,డైనింగ్ హాల్, డార్మిటరీ,తరగతి గదులను పరిశీలించారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థినులకు అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు.వంటగది, డైనింగ్ హాల్,స్టోర్‌రూమ్ అపరిశుభ్రంగా ఉండటం,ఈగలు అధికంగా కనిపించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఏజెన్సీని మార్చాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున శుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థినుల ఆరోగ్యంతో రాజీపడవద్దని స్పష్టం చేశారు.క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ,శుచిశుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు.తరువాత ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ తరగతిని సందర్శించిన కలెక్టర్, ఫిజిక్స్,కెమిస్ట్రీ తదితర సబ్జెక్టులపై విద్యార్థినులను ప్రశ్నించి వారి ప్రతిభను పరీక్షించారు.సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థినులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్,జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ప్రీ-యూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్, వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులు,స్థానిక తహసీల్దార్ కిరణ్మయి,కళాశాల ప్రిన్సిపాల్ అనూష,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

-ఓటరు జాబితా సవరణలో పూర్తి ఖచ్చితత్వం పాటించాలి
-దెందుకూరు పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలు,పంపిణీపై సమీక్ష
-రైతులకు నాణ్యమైన సేవలు అందాలి
-బ్లాక్ మార్కెటింగ్‌కు తావులేకుండా చర్యలు తీసుకోవాలి
-అధికారులను ఆదేశించిన ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర

హంసకలం వార్త

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అత్యంత పారదర్శకంగా,నిష్పాక్షికంగా, పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. అదేరోజు ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు ఎరువులు,విత్తనాలు సకాలంలో అందుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించేందుకు మధిర మండలం దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం మధిర పట్టణంతో పాటు ఎర్రుపాలెం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సూపర్వైజర్లు,బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న తీరు, నింపిన ఫారాలను స్వీకరిస్తున్న విధానం,ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు.పలు కాలనీలు,నివాస ప్రాంతాలను సందర్శించి ఓటర్లతో నేరుగా మాట్లాడి,ఫారాలపై ఉన్న సందేహాలు,అపోహలను నివృత్తి చేశారు.ఓటరు జాబితా సవరణ ఉద్దేశ్యం,ఎన్యూమరేషన్ ఫారాల ప్రాముఖ్యత,సకాలంలో వివరాలు అందజేయాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి బీఎల్‌ఓ తప్పనిసరిగా బీఎల్‌ఓ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే వివరాలను నమోదు చేయాలని, సమాచార నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా మూలాధారమని, అందులో ప్రతి ఓటరు వివరాలు తప్పుల్లేకుండా నమోదు కావడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి నమోదు జరగాలని, డేటా నమోదు,ధృవీకరణ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బీఎల్‌ఓ రోజువారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని తమ పరిధిలోని ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించాలని, అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందించి, పూర్తి చేసిన ఫారాలను నిర్ణీత గడువులోగా తిరిగి స్వీకరించి డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఎవరూ మిగిలిపోకుండా ప్రతి కుటుంబాన్ని చేరుకోవాలని,సర్వే ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ,స్వీకరణ సమయంలోనే ఓటర్లకు ఎదురయ్యే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని,తప్పుడు ప్రచారం లేదా అపోహలకు ఆస్కారం లేకుండా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటర్లలో విశ్వాసం పెంపొందించడం, ఎన్నికల ప్రక్రియపై స్పష్టత కల్పించడం బీఎల్‌ఓల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఓటరు తన వ్యక్తిగత వివరాలను సక్రమంగా నమోదు చేసి,పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్‌ఓలకు అందజేసి ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అలాగే పారదర్శకమైన,విశ్వసనీయమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సహకరించాలని కోరారు.అనంతరం ఖరీఫ్ సీజన్ ఏర్పాట్లను



సమీక్షించేందుకు మధిర మండలం దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.గోదాముల్లో నిల్వ ఉన్న యూరియా,ఇతర ఎరువుల స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి కొరత లేకుండా తగిన నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల లభ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్,నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని,బ్లాక్ మార్కెటింగ్‌కు ఏమాత్రం తావులేకుండా ప్రభుత్వ నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించబడేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.తనిఖీల సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సేవలు, విత్తనాల నాణ్యత,ఎరువుల పంపిణీపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడమే సొసైటీల ప్రధాన బాధ్యత అని, కార్యాలయానికి వచ్చే రైతులను గౌరవంగా ఆదరించి,వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.ఎస్ఐఆర్ తనిఖీల సందర్భంగా ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్,మధిర తహసీల్దార్ రాంబాబు,ఎర్రుపాలెం తహసీల్దార్ సునీత ఎలిజబెత్, మధిర మున్సిపల్ కమిషనర్, సూపర్వైజర్లు ,బీఎల్‌ఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొనగా, దెందుకూరు పీఏసీఎస్ తనిఖీలో మధిర తహసీల్దార్ రాంబాబు, ఏడీఏ వాణిశ్రీ,వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్,పీఏసీఎస్ అధ్యక్షుడు కోట వెంకటకృష్ణ,గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు, సొసైటీ కార్యదర్శి నెలకుదుటి వెంకటేశ్వరరావు,గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హంసకలం వార్త

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని వేమనపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, భోజనశాల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని తెలిపారు.తరగతి గదులు,వసతి గదులు, వంటశాల,పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించడం జరిగిందని, విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని గొలపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారుల ద్వారా ప్రజలకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించడం జరిగిందని, ఫారాలు పూరించిన తర్వాత బూత్ స్థాయి అధికారులు సేకరించి వాటిలోని సమాచారాన్ని బిఎల్ఓ యాప్ లో డిజిటలైజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలను సరైన సమాచారంతో నింపడంలో బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు ప్రజలకు సహకరించి,స్పష్టమైన సమాచారాన్ని పొందుపరిచేలా కృషి చేయాలని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉన్నందున ఓటరు వివరాలను నింపిన ఎన్యుమరేషన్ ఫారాలను అందించని పక్షంలో ఓటు కోల్పోయే అవకాశం ఉందని,బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు,యువత ఫారం పూరింపులో ప్రజలకు సహకరించాలని తెలిపారు. సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 2002 సంవత్సరంలో ఓటు హక్కు కలిగిన వారి కుటుంబ సభ్యులను అనుసంధానం చేస్తూ ప్రస్తుత సవరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని,డబుల్, షిఫ్టెడ్, డెత్ ఓటర్ల తొలగింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.అనంతరం మండల తహసిల్దార్



కార్యాల యాన్ని సందర్శించి సిబ్బంది హాజరు, భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల పెండెన్సీ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయి పరిశీలన చేసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తదనంతరం చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సాయికృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమారస్వామి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య

-జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి చంద్రయ్య

హంసకలం వార్త

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల రాజీవ్ నగర్ లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు,భోజనశాల, వంటగది పనులను మండల విద్యాధికారి, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్,ఏఈఈ (ఈడబ్ల్యూఐడీసీ), కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. కొనసాగుతున్న నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని,నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసం,వసతి, భోజనం,త్రాగునీరు, పారిశుధ్యం,ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలలో ఉన్న డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి నిర్మాణ పనులను వేగవంతం చేసి వర్షాకాలంలో నీరు నిల్వ ఉండ కుండా తగిన చర్యలు చేపట్టాలని, విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్-2026 ప్రత్యేక ఓటరు జాబితా సవరణ



కార్యక్రమాన్ని పరిశీలించారు. బి.ఎల్.ఓ.లు నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల పూరింపు ప్రక్రియను పరిశీలించి,అక్కడికి వచ్చిన ఓటర్లతో మాట్లాడారు. ఓటరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు జాబితాలో నమోదు అయ్యేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త
బుధవారం 08 జూలై 2026

# తంగళ్లపల్లిలో కలెక్టర్ గరిమ అగర్వాల్ తనిఖీలు-ఎరువుల సరఫరాపై సమీక్ష

-పీఏసీఎస్,రెవెన్యూ కార్యాలయాల ఆకస్మిక తనిఖీ
-ఫర్టిలైజర్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి
-రెవెన్యూ సేవలు గడువులోగా పూర్తి చేయండి
-భూ భారతి,సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం పై అధికారులకు ఆదేశాలు

హంసకలం వార్త



రైతులు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్ సేవలను సద్వినియోగం చేసుకుని తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందస్తుగా ఎరువులు బుక్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సూచించారు.అదే సమయంలో రెవెన్యూ అధికారులు సమయపాలన పాటిస్తూ భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మంగళవారం తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల గ్రామంలోని గ్రోమోర్,నేరేళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), అనంతరం తంగళ్లపల్లి రెవెన్యూ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా గ్రోమోర్, నేరేళ్ల పీఏసీఎస్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్,ఆయా కేంద్రాల్లో ఉన్న యూరియా నిల్వలు, ఇటీవల వచ్చిన ఎరువుల పరిమాణం,ఫర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు చేసిన బుకింగ్ వివరాలను మొబైల్ యాప్,రిజిస్టర్‌లలో పరిశీలించారు.గోదాముల్లో ఉన్న యూరియా నిల్వలను తనిఖీ చేసి సరఫరా పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా యూరియా తీసుకునేందుకు వచ్చిన రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి,వారు ఏ గ్రామం నుంచి వచ్చారు,ఎంత భూమి సాగు చేస్తున్నారు,ఏ పంటలు వేస్తున్నారు,ఫర్టిలైజర్ యాప్‌ను వినియోగిస్తున్నారా, యాప్ సేవలపై వారి అభిప్రాయాలు ఏమిటి అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఫర్టిలైజర్ యాప్ అందుబాటులోకి రావడంతో గతంలో మాదిరిగా క్యూల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా,తమకు అనుకూలమైన సమయంలో,నచ్చిన విక్రయ కేంద్రం నుంచి ఎరువులు పొందే అవకాశం కలిగిందని రైతులు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ, రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్‌ను ప్రతి రైతు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.రైతులు తమకు సమీపంలో ఉన్న లేదా అందుబాటులో ఉన్న ఏ గుర్తింపు పొందిన ఎరువుల విక్రయ కేంద్రం నుంచైనా యూరియాను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేసిన ఆమె,ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగు చేపట్టాలని సూచించారు.వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని సూచించారు.అనంతరం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, అధికారుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి కార్యాలయంలో మొత్తం సిబ్బంది సంఖ్య,వారి హాజరు వివరాలపై ఆరా తీశారు. కార్యాలయ నిర్వహణ,ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు.భూ భారతి, సాదాబైనామా కింద వచ్చిన దరఖాస్తుల పురోగతిని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పలు దరఖాస్తులను స్వయంగా పరిశీలించారు.అధికారులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరై ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని,ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దని ఆదేశించారు.భూ భారతి,సాదాబైనామా కింద అందిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.కార్యాలయంలోని అన్ని ఫైళ్లను సక్రమంగా భద్రపరచడంతో పాటు కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది,ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ప్రాంతాల ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉండాలి

-వన మహోత్సవంలో విరివిగా మొక్కలు నాటాలి
-ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
-పెంబి మండలంలో ఆకస్మిక తనిఖీల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాలు

హంసకలం వార్త



మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం పెంబి మండలంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన ఆరోగ్య కేంద్రం, పాఠశాల, కేజీబీవీ,గ్రామ పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓపీ విభాగం,మందుల నిల్వ గది, ఇతర విభాగాలను పరిశీలించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని,రోజువారీ ఓపీ నమోదు, వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు, పాముకాటు కేసులు పెరిగే అవకాశమున్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు తాగునీరు, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, వన మహోత్సవంలో భాగంగా మొక్క నాటి, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ చదువులో ప్రతిభ కనబర్చాలని, ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. బడికి రాని విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యా యులను ఆదేశించారు.మందపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ఎన్యుమరేషన్ ఫారాల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు.సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించి, క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు.ఈ పర్యటనలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్,జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ లక్ష్మణ్,ఎంఈఓ రామ్‌చందర్, ఎఫ్ఆర్ఓ కల్పనాదేవి,సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు సేఫ్టీ అవగాహన కేంద్రాన్ని ప్రారంభించిన డీజీపీ సివి.ఆనంద్







-వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు హెల్మెంట్ల పంపిణీ..
-కమ్యూనిటీ పోలిసింగ్ సీసీ కెమెరాలను వర్చువల్ గా ప్రారంభం...

హంసకలం వార్త

ప్రజలలో, విద్యార్థులు, వాహనదారులలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 'రోడ్డు సేఫ్టీ అవగాహన కేంద్రాన్ని' తెలంగాణ రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ ప్రారంభించారు. వీటి ద్వారా ప్రాక్టికల్ డెమోలు, సైన్ బోర్డుల గుర్తింపు తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి, వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరిస్తూ. పలువురు వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్లు పంపిణీ చేశారు వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా నేలకొండపల్లి మండల ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న 253 సిసి కెమెరాలను పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి వర్చువల్ గా డీజీపీ ప్రారంభించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో సహకరించిన ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకటస్వామిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

-చెన్నూరు కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



హంసకలం వార్త

చెన్నూరు పట్టణం, మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక కొందరు బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర కార్మిక, ఉపాధి,గనుల శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెన్నూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చెన్నూరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు,చెన్నూరు పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం,బస్సు డిపో, అంబేద్కర్ చౌక్ నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు విస్తరణ,అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం, అమృత్ పథకం కింద మూడు తాగునీటి ట్యాంకుల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ అభివృద్ధిని జీర్ణించుకోలేక కొందరు బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.మైనారిటీ హాస్టల్‌కు వెళ్లి భోజనం చేసిన అనంతరం రాత్రివేళ విద్యార్థుల ప్లేట్లలో కారపు పొడి వేసి, ప్రతిరోజూ ఇలాంటి భోజనం అందిస్తున్నారంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఎవరైనా భావిస్తే సంబంధిత అధికారులకు లేదా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, అయితే మంత్రి, ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో అక్రమాలకు,ఇసుక దందాకు పాల్పడిన మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్‌ను మంత్రి వివేక్ వెంకట స్వామి పార్టీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేస్తూ,వ్యక్తిగత కక్షతో మంత్రిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు.విద్యార్థులకు సంబంధం లేని వ్యక్తులు రాత్రి వేళ హాస్టల్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశిస్తే వారిపై వెంటనే పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తరహా రౌడీ రాజకీయాలను బీఆర్ఎస్ నాయకులు అనుసరిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి బెదిరింపు రాజకీయాలకు స్థానం లేదని విమర్శించారు. మంత్రి వివేక్ వెంకట స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసి పరుష పదజాలంతో దూషించిన వ్యక్తులపై వెంటనే పోలీసు కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అసత్య ప్రచారాలు,వ్యక్తిగత దూషణలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీ తగిన విధంగా స్పందిస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దింటి శ్రీనివాస్, బెల్లంకొండ కరుణాసాగర్, అంకా గౌడ్,లింగంపల్లి మహేష్,పాతల నాగరాజ్,చెన్నూరు రాజేష్,చెన్న వెంకటేష్, తనుగుల సతీష్, సలీం, సాహిర్,ఖలీల్,కరీం, ఇబ్రహీం,తనుగుల రవి, సుంకరి సంతోష్, బ్రహ్మయ్య,మున్సిపల్ కౌన్సిలర్లు అజ్జు, పెండ్యాల సాగర్, కో-ఆప్షన్ సభ్యులు సాధన, బోయిన కృష్ణ, సాహిర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారంతోనే విశ్వబ్రాహ్మణులకు మనుగడ

-నాలుగైదు శాతం ఉన్న విశ్వకర్మీయులను విస్మరిస్తారా?
-మండలి ప్రతిపక్ష నేత మధుసూదన్ చారి
-రౌండ్ టేబుల్ సమావేశంలో 6 తీర్మానాలు ఆమోదం

హంసకలం వార్త



విశ్వబ్రాహ్మణులు ఒక శక్తిగా ఎదగాలని,రాజ్యాధికారంలో వాటా చేజిక్కించుకోవాలని శాసనమండలి ప్రతిపక్ష నేత,ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి పిలుపునిచ్చారు.రాజ్యాధికారంతోనే ఏ కులానికైనా గుర్తింపు,మనుగడ ఉంటాయన్నారు.ఐదు వృత్తులను వేర్వేరు కులాలుగా చూపెట్టి...విశ్వకర్మ జాతి జనాభాను తక్కువ చేసి చూపెట్టడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్లే అధికారాన్ని తారుమారు చేస్తున్న తరుణంలో రాష్ట్ర జనాభాలో 4-5 శాతం ఉండే విశ్వబ్రాహ్మణులు ఎన్నికల్లో కీలకంగా మారతారని వక్తలు పేర్కొన్నారు.మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ తొలి శాసనసభాపతి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు తంగెళ్లపల్లి రవి హాజరై...విశ్వబ్రాహ్మణుల కులం గుర్తింపు,ఐక్యత గురించి మాట్లాడారు.గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ ప్రతినిధి చైతన్య కూడా పాల్గొని,తన సామాజిక వర్గం అభ్యున్నతికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానన్నారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో భాగంగా ముఖ్యమైన ఎజెండాగా ఆరు తీర్మానాలను ప్రవేశపెట్టి, ఆమోదించు కున్నారు. ఇందులో ప్రధాన తీర్మానంగా ఐదు వృత్తులైనా...ఒక్కటే కులం...అదే విశ్వకర్మ,విశ్వబ్రాహ్మణుల కులం అని చాటిచెప్పారు .విశ్వకర్మల వృత్తులను భావితరాలకు చాటిచెప్పేందుకు మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని,వృత్తులను పరిరక్షించాలని, ఆర్థికంగా అండగా నిలవాలని తీర్మానాలు ఆమోదించారు.చివరగా తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.పాలకులు తమ తప్పులను సరిదిద్దుకోని పక్షంలో,పోరాటానికి సన్నద్ధమవ్వాలని,న్యాయమైన డిమాండ్ల సాధనకు రాజకీయ నాయకులను,ప్రభుత్వాన్ని కలిసి ఒత్తిడి చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగించిన వక్తలంతా ముక్తకంఠంతో నినదించారు.వచ్చేనెలలో మూడో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో జర్నలిస్ట్ మరియు పారిశ్రామిక వేత్త దేవరకొండ కాళిదాస్,విశ్వకర్మ వేదిక వ్యవస్థాపకులు ఆద్దూరి రవీంద్రా చారి,రచయితల సంఘం నుంచి గాజోజు నాగభూషణం, కుందారం గణేశాచారి,ఉపేంద్రాచారి, దుబ్బాక కిషన్‌రావు,ప్రముఖ ఆంకోలాజిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం, వేదాస్ అధ్యక్షుడు కుమారస్వామి, సదాశ్రీ తదితరులు పాల్గొని విశ్వబ్రాహ్మణులు ఐక్యమత్యం కావాలన్నారు.

# బిజినెస్

## సెబీ బంపర్ ఆఫర్.. ఆగస్ట్ 1 నుంచి మళ్లీ 'ఓపెన్ మార్కెట్ షేర్ బైబ్యాక్' షురూ!



న్యూఢిల్లీ, జులై 7:

భారత స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ' లిస్టెడ్ కంపెనీలకు భారీ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా కంపెనీలు తమ సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేసే 'ఓపెన్ మార్కెట్ షేర్ బైబ్యాక్' విధానాన్ని మళ్లీ పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలు ఆగస్ట్ 1, 2026 నుంచి అమలులోకి రానున్నాయి. 66 రోజుల్లోనే ప్రక్రియ పూర్తికావాలి! సెబీ నోటిఫై చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. కంపెనీలు తమ షేర్ల బైబ్యాక్ ప్రక్రియను గరిష్ఠంగా 66 పని దినాలలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఈ బైబ్యాక్ కోసం ప్రత్యేకంగా ఎలాంటి 'బైబ్యాక్ విండో' అవసరం లేకుండా, రెగ్యులర్ ట్రేడింగ్ మెకానిజం ద్వారానే కంపెనీలు తమ షేర్లను కొనుగోలు చేయడానికి సెబీ అనుమతించింది. దీనివల్ల కంపెనీలకు పనితీరు సులభతరం కావడమే కాకుండా, సమయం కూడా భారీగా కలిసిరానుంది.

**-నిబంధనలు, పరిమితులు:**

అయితే, ఆగస్ట్ 1 నుంచి అమలులోకి రానున్న నిబంధనల ప్రకారం కంపెనీలు కొన్ని పరిమితులను పాటించాల్సి ఉంటుంది. ఓపెన్ మార్కెట్ ద్వారా జరిపే బైబ్యాక్ విలువ.. సదరు కంపెనీ 'పెయిడ్-అప్ క్యాపిటల్' 'ఫ్రీ రిజర్వ్స్' మొత్తంలో 15 శాతం కంటే తక్కువగా ఉండాలి. ఈ 15 శాతం పరిమితిని కంపెనీకి సంబంధించిన స్టాండ్అలోన్ , కన్సాలిడేటెడ్ ఆర్థిక నివేదికల ఆధారంగా లెక్కిస్తారు.

## నెలలో మరోసారి పెరిగిన ట్రయంఫ్ 350సీసీ బైక్‌ల ధర



ట్రయంఫ్ 350 సీసీ బైక్‌ల ధరలు మరోసారి పెరిగాయి. ఏప్రిల్‌లో ఈ సిరీస్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చిన కంపెనీ.. జూన్‌లో ఒకసారి ధరలు పెంచింది. నెల కూడా గడవకముందే తాజాగా మరోసారి రేట్లు సవరించింది. దీంతో కొత్త బైక్ కొనాలనుకునే వారికి అదనపు భారం పడనుంది. 350 సీసీ ఇంజిన్‌తో ఈ మోడళ్లను ట్రయంఫ్ ఏప్రిల్‌లో విడుదల చేసింది. 18 శాతం జీఎస్‌టీ ప్రయోజనం వినియోగదారులకు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రారంభంలో ధరలను పెద్దగా మార్చలేదు. అయితే జూన్‌లో స్పీడ్ టీ4, స్పీడ్ 400, స్క్రాంబ్లర్ 400 ఎక్స్‌సీ, థ్రక్స్టన్ 400 ధరలను పెంచింది. తాజాగా 350 సీసీ శ్రేణిలోని అన్ని మోడళ్ల ధరలను మరోసారి సవరించింది. ఈసారి పెంపు 1.22 శాతం నుంచి 5.03 శాతం వరకు ఉంది. అన్ని మోడళ్లలో స్పీడ్ టీ4 ధరనే అత్యధికంగా పెరిగింది. ఈ బైక్‌పై రూ.10 వేల పెంపు ప్రకటించారు. దీంతో దీని ధర రూ.1.99 లక్షల నుంచి రూ.2.09 లక్షలకు చేరింది. విడుదలైనప్పటి ధరతో పోలిస్తే ఇప్పుడు ఇది రూ.14 వేలు ఎక్కువైంది. స్పీడ్ 400 ధర రూ.2.34 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు పెరిగింది. ట్రాకర్ 400 ధరపై అతి తక్కువగా రూ.3 వేల పెంపు ప్రకటించారు. దీంతో దీని ధర రూ.2.46 లక్షల నుంచి రూ.2.49 లక్షలకు చేరింది. స్క్రాంబ్లర్ 400 ఎక్స్ ధర రూ.2.59 లక్షల నుంచి రూ.2.65 లక్షలకు పెరిగింది. థ్రక్స్టన్ 400 ధర రూ.2.70 లక్షల నుంచి రూ.2.75 లక్షలకు చేరుకుంది. స్క్రాంబ్లర్ 400 ఎక్స్‌సీపై కూడా రూ.5 వేల పెంపుతో కొత్త ధర రూ.2.99 లక్షలకు చేరింది. ట్రయంఫ్ బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ప్రీమియం మోటార్‌సైకిల్ తయారీ సంస్థ. 1902లో దీన్ని స్థాపించారు. ఈ కంపెనీ స్పోర్ట్స్, అడ్వెంచర్, క్లాసిక్ శైలి బైక్‌లకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. భారత్‌లో ట్రయంఫ్ తన బైక్‌లను బజాజ్ ఆటో భాగస్వామ్యంతో తయారు చేసి విక్రయిస్తోంది. స్పీడ్ 400, స్క్రాంబ్లర్ 400 ఎక్స్ వంటి మోడళ్లను బజాజ్‌తో కలిసి అభివృద్ధి చేసింది.

## నాలుగు రోజుల లాభాలకు బ్రేక్- స్వల్పంగా నష్టపోయిన సూచీలు



నాలుగు సెషన్లుగా కొనసాగుతున్న స్టాక్ మార్కెట్ల లాభాల జోరుకు నేడు బ్రేక్ పడింది. మెటల్, రియల్టీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో దేశీయ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఐటీ, కన్స్యూమర్ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించినప్పటికీ, అది మార్కెట్లను పూర్తిగా నష్టాల నుంచి బయటపడేయలేకపోయింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి.. బీఎస్ఈ సెన్సెక్స్ 104.35 పాయింట్ల నష్టంతో 78,180.72 వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 31.65 పాయింట్లు స్వల్పంగా తగ్గి 24,398.70 వద్ద ముగిసింది. రోజంతా సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ ఐటీ సూచిక మిగతా మార్కెట్‌ను అధిగమించి మంచి పనితీరు కనబరిచింది. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీలు కూడా సానుకూలంగా ముగిశాయి. అయితే, నిఫ్టీ మెటల్, నిఫ్టీ రియల్టీ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. నిఫ్టీ షేర్లలో టైటాన్ కంపెనీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మరోవైపు బ్రాడర్ మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.3%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.55% చొప్పున నష్టపోయాయి. ప్రస్తుతం అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, వాణిజ్య సుంకాలకు సంబంధించిన ఆందోళనలు తగ్గడంతో మార్కెట్ దృష్టి కార్పొరేట్ కంపెనీల మొదటి త్రైమాసిక (Q1FY27) ఫలితాలు, రుతుపవనాల పురోగతిపైకి మళ్లుతోందని నిపుణులు చెబుతున్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐ) ప్రవాహం మెరుగుపడటం, రూపాయి విలువ స్థిరంగా ఉండటం వంటి అంశాలు స్వల్పకాలంలో మార్కెట్‌కు మద్దతునిస్తాయని వారు భావిస్తున్నారు.

## 45వ పడిలోకి 'తలా'- ప్రపంచకప్ వేదికగా ఫిఫా వినూత్న శుభాకాంక్షలు!



స్పోర్ట్స్ డెస్క్:

భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన కెప్టెన్, ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఫినిషర్‌గా పేరుగాంచిన మహేంద్ర సింగ్ ధోనీ మంగళవారం తన 45వ పుట్టినరోజు వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడా ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా 'మహీ'కి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ వేడుకల్లో భాగంగా అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్యచేసిన ఓ పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది.ప్రస్తుతం జరుగుతున్నఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో చెరో 7 గోల్స్ చేసిన స్టార్ ఫుట్‌బాలర్లు లియోనెల్ మెస్సి, కిలియన్ ఎంబాపె, ఎర్లింగ్ హాలాండ్‌ల ఫొటోలను ఫిఫా వరల్డ్ కప్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది. దానికి '7 గోల్స్.. తలా ఫర్ ఎ రీజన్.. హ్యాపీ తలా డే' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ధోనీ జెర్సీ నంబర్ '7' తో పాటు, చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులు అతడిని ప్రేమగా పిలుచుకునే 'తలా' అనే పేరును ప్రస్తావిస్తూ ఫిఫా ఇచ్చిన ఈ ట్రిబ్యూట్ క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా ధోనీతో ఉన్న ఫొటోను ఎక్స్‌లో పంచుకుంటూ.. 'భారత క్రికెట్‌కు నిజమైన ఐకాన్ అయిన ఎంఎస్ ధోనీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చే నీ నాయకత్వ పటిమ, వారసత్వం ఇలాగే కొనసాగాలి' అని ఆకాంక్షించారు. మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ 2013 ఛాంపియన్స్ ట్రోఫీ విజయానికి సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ.. 'ఒత్తిడిలోనూ నువ్వు ప్రదర్శించే ప్రశాంతత, ఆటను నడిపించే తీరు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎందరో క్రికెటర్లకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది' అని కొనియాడాడు. మాజీ బ్యాటర్ ఆకాశ్ చోప్రా స్పందిస్తూ.. 'కొంతమంది ఆటగాళ్లు మ్యాచ్‌లు గెలుస్తారు, మరికొందరు ట్రోఫీలు గెలుస్తారు.. కానీ ఎంఎస్ ధోనీ మాత్రం ఒక శకాన్నే గెలిచాడు. హ్యాపీ బర్త్‌డే మహీ' అంటూ ధోనీ క్రేజ్‌ను అద్భుతంగా వర్ణించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, ధోనీ బ్రాండ్ వాల్యూ, క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని ఈ వేడుకలు నిరూపించాయి.

## తప్పుడు వార్తలపై సూర్యకుమార్ యాదవ్ ఫైర్!




స్పోర్ట్స్ డెస్క్:

జింబాబ్వేతో జరగబోయే 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టును బీసీసీఐ ప్రకటించించింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోనే జట్టు ఈ పర్యటనను కొనసాగించనుంది. ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను అందించిన అప్పటి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్థానంలో అయ్యర్ జట్టు పగ్గాలు చేపట్టాడు. గత కొంతకాలంగా అంతర్జాతీయ క్రికెట్‌లో ఫామ్ కోల్పోయి పరుగుల కోసం ఇబ్బంది పడుతుండటమే సూర్యకుమార్ ని సెలెక్టర్లు పక్కన పెట్టడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.జట్టులో చోటు దక్కనప్పటికీ సూర్యకుమార్ యాదవ్ తన క్రీడా స్ఫూర్తిని చాటుకున్నాడు. ఎక్స్ వేదికగా టీమిండియాకు ఆల్ ది బెస్ట్ చెబుతూ భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. 'భారత జట్టును చూస్తే చాలా సంతోషంగా ఉంది. వారికి ఎల్లప్పుడూ నా బెస్ట్ విషెస్ ఉంటాయి. కుర్రాళ్లంతా మైదానంలో అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నారు. వారికి నా పూర్తి మద్దతు ఎప్పటికీ ఉంటుంది' అని స్కై పేర్కొన్నాడు. వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని సూర్యకుమార్ ప్రత్యేకంగా అభినందించాడు. 'వైభవ్.. నీదొక అద్భుతమైన ప్రయాణం. ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తూ దేశం గర్వించేలా రాణించు' అని సూర్య తెలిపాడు. ఇదే సమయంలో సోషల్ మీడియాలో తన పేరిట ప్రచారంలో ఉన్న కొన్ని తప్పుడు వ్యాఖ్యలపై సూర్యకుమార్ స్పష్టతనిచ్చాడు. 'నా ప్రమేయం లేకుండా నా పేరుతో కొన్ని తప్పుడు ప్రకటనలు ఆన్‌లైన్‌లో తిరుగుతున్నాయి. అవి తప్పుడు వార్తలు.. వాటిని ఎవరూ నమ్మవద్దు, అలానే షేర్ చేయవద్దు. భారత క్రికెట్, నా సహచర ఆటగాళ్లపై నాకున్న గౌరవం ఎప్పుడూ మాటల కంటే చేతల్లోనే కనిపిస్తుంది' అని రూమర్లకు చెక్ పెట్టారు.

# స్పోర్ట్స్

## అఫ్గాన్ క్రికెట్‌లో విషాదం-మాజీ క్రికెటర్ కన్నుమూత




స్పోర్ట్స్ డెస్క్:

అఫ్గానిస్థాన్ క్రికెట్‌లో విషాదం చోటుచేసుకుంది. ఆ దేశ మాజీ క్రికెటర్ షాపూర్ జద్రాన్ కన్నుమూశాడు. ఈ విషయాన్ని అఫ్గాన్ క్రికెట్ బోర్డు మంగళవారం ధ్రువీకరించింది. జద్రాన్ గత కొంతకాలంగా అరుదైన వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసిందే. వ్యాధి కారణంగా అతడి శరీరంలో తెల్ల రక్తకణాల సంఖ్య పూర్తిగా పడిపోయింది.అతడి ఆరోగ్య పరిస్థితి విషయమించడంతో అఫ్గాన్ నుంచి భారత్‌కు తరలించి అత్యాధునిక చికిత్స అందిస్తున్నారు. గత కొన్నినెలలుగా ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జద్రాన్ ఇవాళ తుదిశ్వాస విడిచాడు. రేపు(బుధవారం) అతడు 39వ వసంతంలో అడుగుపెట్టాల్సి ఉంది. పుట్టినరోజుకు ఒకరోజు ముందుగానే మరణించడం అతడి కుటుంబాన్ని మరింత విషాదంలోకి నెట్టేసింది.

**-అఫ్గాన్ క్రికెట్ నివాళి**

షాపూర్ జద్రాన్ మరణం పట్ల అఫ్గాన్ క్రికెట్ బోర్డు సంతాపం వ్యక్తం చేసింది. అఫ్గాన్ క్రికెట్ అభివృద్ధిలో అతడూ భాగమయ్యాడని.. చిన్న వయసులోనే జద్రాన్ కన్నుమూయడం కలచివేసిందని విచారం వ్యక్తం చేసింది. షాపూర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. అతడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించింది. అలానే సహచర క్రికెటర్లు అతడి మృతికి సంతాపం తెలియజేశారు. జద్రాన్ అఫ్గాన్ తరఫున 2009- 2020 మధ్య అంతర్జాతీయ క్రికెట్ ఆడాడు. ఇంటర్నేషనల్ కెరీర్‌లో 44 వన్డేలు, 36 టీ20 మ్యాచ్‌లు ఆడిన షాపూర్.. మొత్తం 37 వికెట్లు కూల్చాడు. మూడుసార్లు టీ20 ప్రపంచకప్ జట్లలో సభ్యుడిగా ఉన్నాడు.

# వేగం అందుకున్న వెంకీ-అనిల్ సినిమా.. సెట్స్‌లోకి వెంకటేశ్

వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కలిసి నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ వేగం అందుకుంది. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కీలక షెడ్యూల్ ప్రారంభమైంది. దీంట్లో పాల్గొనేందుకు వెంకటేశ్ తాజాగా సెట్స్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ ఎపిసోడ్లలో వెంకటేశ్‌తో పాటు నందమూరి కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. ఇటీవల కల్యాణ్‌రామ్ పుట్టినరోజును చిత్రబృందం సెట్స్‌లోనే జరుపుకొంది. అదే సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, 2027 సంక్రాంతికి సినిమా విడుదల కానుందని ప్రకటించింది. ఇటీవల ఈ సినిమా పేరుతో నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో నిర్మాతలు హెచ్చరిక జారీ చేశారు. అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వచ్చే ప్రకటనలను మాత్రమే నమ్మాలని, వ్యక్తిగత వివరాలు లేదా డబ్బు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దని స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితమే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో



ప్రారంభమైంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

# కొడుకు కోసం సినిమాల ఎంపికను మార్చుకున్న కాజల్ అగర్వాల్!

- -పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న కాజల్
- -తన కొడుకు గర్వపడే సినిమాలనే చేస్తానని వెల్లడి
- -సందేశాత్మక చిత్రాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నానన్న కాజల్

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. అయితే తల్లి అయిన తర్వాత సినిమాల ఎంపికలో తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని ఆమె తాజాగా వెల్లడించింది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ'తో పాటు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'రామాయణ' షూటింగ్‌లతో బిజీగా ఉన్న కాజల్... తన కొడుకు నీల్ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వంగా చెప్పుకునేలా ఉండే స్క్రిప్ట్‌లను ఎంచుకుంటున్నట్లు తెలిపింది. కమర్షియల్ అంశాల కంటే బలమైన పాత్రలు, సందేశాత్మక చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పింది. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ఇండియా స్టోరీ'లో కాజల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో కనిపించనుంది. శ్రేయస్ తల్పడే కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం జూలై 24న విడుదల కానుంది. కల్తీ ఆహారం, పురుగుమందుల ప్రభావం నేపథ్యంలో సాగే ఈ కథ విన్నాక... ఒక తల్లిగా తన ఇంట్లో వాడే ఆహార పదార్థాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించానని కాజల్ పేర్కొంది. మరోవైపు, నితేష్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'రామాయణ'లో కాజల్ మండోదరి పాత్ర పోషిస్తోంది. తన కుమారుడు నీల్‌కు చిన్నప్పటి నుంచే రామాయణ కథలంటే ఇష్టమని, అయితే అతనికి శ్రీరాముడి కంటే రావణుడి పాత్రే ఎక్కువ ఇష్టమని నవ్వుతూ




చెప్పింది. 'రామాయణ' రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్‌కు ఐదేళ్లు వస్తాయని, థియేటర్‌లో వాడు చూసే మొదటి సినిమా ఇదే అవుతుందని కాజల్ ఆనందం వ్యక్తం చేసింది.



# విజయ్ 'జన నాయగన్' సెన్సార్ రిపోర్ట్ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ

- -'జన నాయగన్'కు సెన్సార్ ప్రక్రియ పూర్తయిందంటూ ప్రచారం
- -ఈ ప్రచారాన్ని నమ్మొద్దన్న నిర్మాతలు
- -సెన్సార్ బోర్డు కొన్ని సవరణలు సూచించిందని వెల్లడి

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' సెన్సార్ ప్రక్రియ పూర్తయి 'ఏ' సర్టిఫికెట్ వచ్చిందంటూ సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. జులై 23న విడుదల అని కూడా వార్తలు వ్యాపించాయి. అయితే ఇది పూర్తిగా తప్పుడు సమాచారం అని చిత్ర నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. సెన్సార్ బోర్డు సభ్యులు సినిమాను వీక్షించి కొన్ని సవరణలు సూచించారని, ప్రస్తుతం ఆ మార్పులు చేసే పనిలో బృందం బిజీగా ఉందని నిర్మాతలు తెలిపారు. మార్పులు పూర్తి కాగానే రీ-సెన్సార్ కోసం బోర్డుకు పంపుతామని, అన్ని సాంకేతిక పనులు త్వరగా పూర్తి చేసి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. అభిమానులు తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని, అధికారిక అప్‌డేట్ వచ్చే వరకు వేచి చూడాలని కోరారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్ పాత్రను పోషించింది. విజయ్ చివరి చిత్రం కావడంతో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# 'సూపర్ సుబ్బు' ( నెట్ ఫ్లిక్స్) సిరీస్ రివ్యూ!

ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన సిరీస్ లు రాజ్యం చేస్తున్నాయి. హారర్ థ్రిల్లర్ .. సస్పెన్స్ థ్రిల్లర్ .. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే కథలు ఒక రేంజ్ లో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సెక్స్ ఎడ్యుకేషన్ కి సంబంధించిన కథ ఒకటి 'నెట్ ఫ్లిక్స్' తెరపైకి వచ్చింది. ఆ సిరీస్ పేరే 'సూపర్ సుబ్బు'. సందీప్ కిషన్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్, ఈ నెల 2వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. సుబ్రహ్మణ్యం (సందీప్ కిషన్) ను అంతా సుబ్బు అని పిలుస్తుంటారు. తండ్రి .. తల్లి .. ఓ మేనమామ ఇదే అతని కుటుంబం. తండ్రి కుక్కుటేశ్వరరావు (మురళీ శర్మ) స్కూల్ హెడ్ మాస్టర్ గా పనిచేసి రిటైర్ అవుతాడు. ఇక మేనమామ సునీల్ ( సంపూర్ణేశ్ బాబు) పెళ్లి చేసుకోకుండా అలా ఉండిపోతాడు. తాను పనిచేసిన స్కూల్లో ల్యాబ్ అసిస్టెంట్ గా సుబ్బుకి టెంపరరీ పోస్ట్ వేయిస్తాడు కుక్కుటేశ్వరరావు. టీనేజ్ లో ఉన్నప్పటి నుంచే సెక్స్ ఎడ్యుకేషన్ పట్ల సుబ్బు ఆసక్తిని చూపించేవాడు. అందువలన అతని పట్ల తండ్రి ఒక రకమైన కోపాన్ని పెంచుకుంటాడు. ఒకానొక సందర్భంలో సుబ్బు ల్యాబ్ అసిస్టెంట్ జాబ్ కూడా పోగోట్టుకునే పరిస్థితి వస్తుంది. దాంతో అతనికి సెక్స్ ఎడ్యుకేషన్ పట్ల ఆసక్తి ఉందనే విషయాన్ని ప్రిన్సిపాల్ మధుసూదనరావు (బ్రహ్మానందం) గమనిస్తాడు. 'మాకీపూర్' అనే విలేజ్ కి సెక్స్ ఎడ్యుకేషన్ నేర్పించడానికి వెళ్లిన తన బావమరిది తన్నులు తినేసి తిరిగి రావడంతో, మధుసూదనరావు ఆ స్థానంలో సుబ్బును పంపిస్తాడు. అయితే తాను ఏ పనిపై వెళుతున్నది తండ్రికి చెప్పకూడదని సుబ్బు మాట తీసుకుంటాడు. దివ్య (మానస చౌదరి)తో సుబ్బుకి పెళ్లి కుదురుతుంది. ఆమెకి నచ్చినట్టుగా ఉండటం కోసమే, అతను ఆ జాబ్ చేయడానికి అంగీకరిస్తాడు. 'మాకీపూర్' గ్రామస్తులు చాలా తేడా మనుషులనీ, వాళ్లకి లైంగిక విజ్ఞానంపై ఏ మాత్రం అవగాహనా లేదని తెలుసుకుంటాడు. వాళ్లలో మూఢనమ్మకాలు బలంగా ఉంటాయని వింటాడు. ఆ తరువాతనే అతను మాకీపూర్ వెళ్లి, తన డిపార్టుమెంటుకి చెందిన 'కాంతారావు' (గెటప్ శ్రీను)ను కలుసుకుంటాడు. 'మాకీపూర్'కి సంబంధించినంత వరకూ గిరి - గంగాధర్ - కిషన్ అనే వ్యక్తులు చాలా ప్రమాదకరమైనవారని తెలుసుకుంటాడు. ఇక సర్పంచ్ తమ్ముడు రమేశ్ కూడా అదే కోవకి చెందినవాడనే విషయం సుబ్బుకి అర్థమవుతుంది. అక్కడే అతనికి స్వాతి (మిథిలా పాల్కర్) పరిచయమవుతుంది. హీరోయిన్ కావాలనే పట్టుదలతో ఉన్న ఆమె, రీల్స్ చేస్తూ ఉంటుంది. ఆ ఊళ్లో సుబ్బుకి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? వాటిని అతను ఎలా అధిగమిస్తాడు? అనేది కథ. మారుమూల గ్రామాలలోని ప్రజలు సెక్స్ గురించి మాట్లాడటానికి ఇబ్బందిపడుతూ ఉంటారు. శానిటరీ ప్యాడ్ .. కండోమ్ గురించి మాట్లాడటాన్ని బూతుగా భావిస్తారు. ఆడపిల్లలు .. మగపిల్లలు ఎందుకు పుడతారనేది తెలియక, మగపిల్లల కోసం వరుస కాన్పులకు వెనుకాడకపోవడం కనిపిస్తుంది. ఫ్యామిలీ ప్లానింగ్ పట్ల అవగాహన లేని కారణంగా, పురుషులు తాము ఏదో కోల్పోయామనే ఆందోళనకి లోనవుతుంటారు. అలాంటి ఒక ఊరుకు సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గా వెళ్లిన సుబ్బు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది ఈ కథలోని ప్రధానమైన అంశం. టీనేజ్ నుంచి తన కొడుకు సెక్స్ పట్ల ఆసక్తిని కనబరుస్తూ ఉన్నాడని భావించిన సుబ్బు తండ్రి, కొడుకు పట్ల ఒక అసహ్యాన్ని పెంచుకుంటాడు. సుబ్బు మేనమామకు




కూడా అతనిపై అలాంటి అభిప్రాయమే ఉంటుంది. ఈ కథలోకి తొలి అడుగులు వేస్తున్న ప్రేక్షకులు కూడా ముందుగా అదే ఆలోచనకి వస్తారు. కానీ అతను సెక్స్ కంటే కూడా ప్రేమకి ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తాడనే దిశగా ఆ పాత్రను నడిపించిన తీరు గొప్పగా అనిపిస్తుంది. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో సెక్స్ అనేది చాలా సున్నితమైన అంశంగా అనిపిస్తుంది. ముఖ్యంగా అక్కడి మహిళల దగ్గర అందుకు సంబంధించిన ప్రస్తావన చేయడమే ప్రమాదకరంగా మారుతుంది. ఎందుకంటే తరతరాలుగా బలపడిన మూఢనమ్మకాలలోనే వాళ్లు బ్రతుకుతుంటారు. అలాంటి ఒక ఊర్లో .. అక్కడి ప్రజలలో లైంగిక సంబంధమైన విజ్ఞానాన్ని పెంపొందించడానికి కథానాయకుడు ఎంత రిస్క్ చేశాడనేది చూపించడానికి దర్శకుడు ప్రయత్నించాడు. అయితే దర్శకుడు సుబ్బు పాత్రపై .. అతని తండ్రి పాత్రపై మాత్రమే పూర్తి దృష్టి పెట్టడం కనిపిస్తుంది. ఎందుకంటే ఈ రెండు పాత్రలు మినహా మిగతా పాత్రలు తేలిపోతుంటాయి. సుబ్బుతో పెళ్లికి ఒప్పుకున్న 'దివ్య' పాత్ర .. విలేజ్ లో రీల్స్ చేసే 'స్వాతి' పాత్ర .. సర్పంచ్ తమ్ముడు కూతురు 'అలేఖ్య' పాత్రలను సరిగ్గా డిజైన్ చేయలేదు. దాంతో ఆ పాత్రల వైపు నుంచి ఆశించిన అవుట్ పుట్ రాలేదు. కథలో లవ్ .. కామెడీ ఎమోషన్స్ ఉన్నాయి. కానీ వాటిని బలంగా ఆవిష్కరించలేకపోయారు. చాలా పాత్రలు తెరపైకి వస్తుంటాయి .. వెళుతుంటాయి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449